

అట్రాసిటీ బాధితులకు త్వరితగతిన పరిహారమందించాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ వేధింపుల నిరోధక చట్టంలో నమోదైన కేసుల స్థితిని తెలుసుకుని, బాధితులకు అందాల్సిన నష్టపరిహారం తక్షణం అందేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. శనివారం నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన నూజివీడు డివిజన్ ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రన్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి కేసుల ఛార్జి షీటు దాఖలు చేసిన వెంటనే తమను సంప్రదిస్తే త్వరితగతిన నష్టపరిహారం మంజూరు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్, ఎఎస్‌డబ్ల్యూఒ డి.శ్రీనివాసరావు, పట్టణ సిఐ ఎంవిఎస్ఎన్.మూర్తి, ఎస్‌ఐలు రామకృష్ణ, చంటిబాబు, చెన్నారావు పాల్గొన్నారు.

జిల్లాలో ముగిసిన 'పోలవరం పోరుకేక'

ఏలూరు మీదుగా కృష్ణా జిల్లాలోకి ప్రవేశం

ఆరు రోజులు ఆరు మండలాల మీదుగా 135 కిలోమీటర్లు సాగిన యాత్ర

25 గ్రామాల ప్రజలతో పాదయాత్ర బృందం మమేకం

తిలకం దిద్ది.. హారతులిచ్చి స్వాగతం పలికిన గ్రామస్తులు

ముంపు గ్రామాలు, పునరావాస కాలనీల్లో సమస్యలపై ఘొల్లుమన్న నిర్వాసితులు

ధైర్యం చెబుతూ అండగా ఉంటామని నేతల భరోసా

తరలొచ్చిన జాతీయ, రాష్ట్ర నాయకులు

దారి పొడవునా టిడిపి, జనసేన, కాంగ్రెస్, బిఎస్‌పి, ప్రజాసంఘాల మద్దతు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాగుతున్న పోలవరం పోరుకేక పాదయాత్ర శనివారం జిల్లాలో ముగిసింది. హనుమాన్ జంక్షన్ వద్ద కృష్ణా జిల్లాలోకి ప్రవేశించింది. జూన్ 26వ తేదీ నుంచి జులై ఒకటో తేదీ వరకు ఆరు రోజులపాటు జిల్లాలో యాత్ర సాగింది. తొలిరోజు 26వ తేదీ అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం గ్రామం నుంచి గోదావరి దాటి వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట వద్ద ఏలూరు జిల్లాలోకి ప్రవేశించింది. అక్కడ నుంచి కుక్కునూరు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం, ఏలూరు మండలాల్లోని 25 గ్రామాల మీదుగా యాత్ర సాగింది. పోలవరం నుంచి బుట్టాయగూడెం వరకూ ఉపయాత్ర నిర్వహించారు. మొత్తంగా 135 కిలోమీటర్ల మేర జిల్లాలో పాదయాత్ర సాగింది. మొత్తం 17 చోట్ల సభలు, ఆరుచోట్ల బహిరంగ సభల్లో నాయకులు మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర నాయకులు తరలొచ్చి యాత్రకు సంఘీభావం తెలపడమే కాకుండా, పాదయాత్రతో కలిసి అడుగులు వేశారు. తొలిరోజు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం, వి.వెంకటేశ్వర్లు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి పాల్గొనగా, రెండోరోజు ప్రత్యేక హోదా సాధన కమిటీ కన్వీనర్ చలసాని శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌ఎ చందా లింగయ్యదొర తమ మద్దతు ప్రకటించారు. మూడో రోజు కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్ సింగ్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, పాల్గొనగా, నాలుగో రోజు ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కె.ధనలక్ష్మి, ఐదోరోజు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఆరోరోజు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, బిఎస్‌పి నాయకులు నేతల రమేష్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.



నేతలకు స్వాగతం పలుకుతున్న మహిళలు

టిడిపి, జనసేన, కాంగ్రెస్, బిఎస్‌పి, ప్రజాసంఘాల మద్దతు

పోలవరం పోరుకేక పాదయాత్రకు టిడిపి, జనసేన, కాంగ్రెస్, బిఎస్‌పి నాయకులు ప్రతి మండలంలోను ఎదురేగి పోరుయాత్ర బృందానికి మద్దతు ప్రకటించారు. టిడిపి, జనసేన మండలాధ్యక్షుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, స్వాగతం పలకడమే కాకుండా పాదయాత్రతో కలిసి నడిచి సభల్లో పాల్గొన్నారు. జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ మద్దతు పలకగా, జంగారెడ్డిగూడెంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు, ఏలూరులో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి చంటి మద్దతు తెలిపారు. జనసేన పోలవరం నియోజకర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు. సిఐటియు రాష్ట్ర, జిల్లా నాయకులు, ఆశావర్కర్స్ యూనియన్, ఐద్వా, డివైఎఫ్‌ఐ, ఎస్ఎఫ్ఐ, ఎల్ఐసి ఏజెంట్లు యూనియన్, ఐలు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, గిరిజన సంఘాలు పెద్దఎత్తున మద్దతు పలికాయి. విశాఖపట్నం, కాకినాడ, పశ్చిమగోదావరి జిల్లా తదితర ప్రాంతాల నుంచి పాదయాత్ర బృందానికి మద్దతు పలికేందుకు ప్రజాసంఘాల నేతలు తరలొచ్చారు.




ఏలూరు సభలో విల్లు ఎక్కుపెట్టిన నేతలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై నాయకుల మండిపాటు

జిల్లాలో ఆరు రోజుల పాటు సాగిన పోరుకేక పాదయాత్రలో పాల్గొన్న నాయకులు నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం హామీ ఇచ్చిన పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలు, భూపరిహారం రూ.ఐదు లక్షలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరద పరిహారం రూ.పది వేలు తక్షణం అందించాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఇవ్వాలని, నిర్వాసిత కాలనీల్లో తాగునీరు, బడులు, ఆసుపత్రులు, శ్మశాన వాటికలు వంటి కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం వెంటనే నిధులు విడుదల చేసి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. పాదయాత్రకు నిర్వాసితుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ప్రతి గ్రామంలోనూ పాదయాత్ర రథసారధి వి.శ్రీనివాసరావుకు వినతుల రూపంలో తమ సమస్యలను తీసుకొచ్చారు. నిర్వాసితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల నాలుగో తేదీ విజయవాడలో జరగనున్న బహిరంగ సభ తర్వాత అన్ని పార్టీలనూ కలుపుకుని కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ప్రతి గ్రామాన్నీ సమర క్షేత్రంగా మారుస్తామని హెచ్చరించారు.



పెదపాడు మండలం వట్లూరులో సాగుతున్న పాదయాత్ర



సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ఏలూరు నగరంలో మార్మోగిన 'పోరుకేక'

ఏలూరు ప్రతినిధి, ఏలూరు అర్బన్: పోలవరం పోరుకేక యాత్రతో శనివారం ఏలూరు నగరం దద్దరిల్లింది. తంగెళ్లమూడిలో ప్రారంభమై ఏలూరు నగరం మీదుగా హనుమాన్ జంక్షన్ వరకూ సాగింది. పాదయాత్రకు అడుగడుగునా వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజలు నీరాజనాలు పలికారు. టిడిపి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జులు బడేటి చంటి, రెడ్డి అప్పలనాయుడు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, బిఎస్‌పి నాయకులు నేతల రమేష్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మద్దతు ప్రకటించారు. ఎల్ఐసి ఏజెంట్ల యూనియన్, చేతివృత్తిదారుల సంఘం, ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు తమ పూర్తి మద్దతు ప్రకటిస్తూ పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు. తంగెళ్లమూడి, పన్నెండు పంపలు సెంటర్, పవర్ పేట రైల్వేస్టేషన్, ఆర్ఆర్‌పేట, ఫైర్‌స్టేషన్, వట్లూరు మీదుగా ఈయాత్ర సాగింది. ఆర్ఆర్‌పేట పార్క్ వద్ద జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, బిఎస్‌పి నాయకులు నేతల రమేష్, కాంగ్రెస్ నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఎం నాయకులు వి.ఉమామహేశ్వరరావు, సిఐటియు ఆలిండియా ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడారు. పాదయాత్రకు టిడిపి నాయకులు బడేటి చంటి రూ.పది వేలు విరాళం ప్రకటించగా, చేతివృత్తిదారుల సంఘం నాయకులు పిచ్చుకల ఆదిశేషు తమ సంఘం తరపున రూ.11,300 విరాళంగా పాదయాత్ర నాయకులకు అందించారు.

జగన్ కేంద్రాన్ని నిధులు అడగటం లేదు

రాజనాల రామ్మోహన్‌రావు, కాంగ్రెస్ నాయకులు



పోలవరం నిర్వాసితులను పట్టించుకోకపోవడం దారుణం. బలవంతంగా తరలిస్తున్న పరిస్థితి ఉంది. కేంద్రాన్ని జగన్ నిధులు అడగడం లేదు. అభివృద్ధిపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదు. నిర్వాసితులపై కనీస కనికరం లేని జగన్ గద్దె దిగాలి. కేంద్రాన్ని నిలదీసి నిధులు తేవాలి.

నిర్వాసితుల గోడు సిఎంకు పట్టడం లేదు

రెడ్డి అప్పలనాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి



పోలవరం పోరుకేక పాదయాత్రకు జనసేన పూర్తి మద్దతు ప్రకటిస్తోంది. నిర్వాసితుల సమస్యలు సిఎం జగన్‌కు పట్టడం లేదు. నిర్వాసితులకు న్యాయం చేయాలి. రెండు లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు కేటాయించలేరా. విభజన చట్టంలోని ప్రత్యేక హోదా గురించి కూడా ప్రభుత్వం మాట్లాడటం లేదు.



వట్లూరులో రోడ్డుపక్కన సేదతీరుతున్న నేతలు









ఏలూరులో జరిగిన సభలో మాట్లాడుతున్న నేతలు వి.ఉమామహేశ్వరరావు, ఎ.రవి, పిల్లి రామకృష్ణ, పళ్లెం కిషోర్, బి.సోమయ్య, జి.బేబీరాణి, నేతల రమేష్‌బాబు



ఏలూరులో పాదయాత్రలో పాల్గొన్న టిడిపి నేత బడేటి చంటి



డప్పు కళాకారుల సందడి



గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - మండవల్లి

విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మండవల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెనుమిల్ల గ్రామానికి చెందిన పడమటి రామకష్ణ(51) స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఎప్పటిలాగానే శుక్రవారం ఉదయం విధులకు హాజరైన ఆయనను బందరులోని పాతనేరస్తుల కదలికలు, వివరాల సేకరణకు పంపారు. మధ్యాహ్న సమయంలో తీవ్రమైన గుండెనొప్పి రావడంతో వెంటనే బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రామకృష్ణ మృతితో గ్రామంలోనూ, స్టేషన్ పరిధిలోనూ విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన విధుల్లో ఎంతో నిబద్ధతో పనిచేసేవారని సహోద్యోగులు కొనియాడారు. భర్త అకాల మృతితో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. జిల్లా అదనపు ఎస్‌పి ఎంజెవి.భాస్కర్‌రావు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢసానుభూతిని తెలిపారు. అనంతరం ఎఎస్‌పి మాట్లాడుతూ రామకృష్ణ మృతి కుటుంబానికి తీరని లోటు అని అన్నారు. కైకలూరు సిఐ ఆకుల రఘు మాట్లాడుతూ మంచి వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి రామకృష్ణ అని అన్నారు. అనంతరం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రామకృష్ణ, ఎఎస్‌ఐ రాజు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏడాది క్రితం ఉద్యోగోన్నతి

తొలుత రామృష్ణ 1995లో కానిస్టేబుల్‌గా విధుల్లోకి చేరారు. వివిధ ప్రాంతాల్లో పనిచేసిన ఆయన చివరి ఐదు సంవత్సరాలు మండవల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేశారు. అనంతరం ఏడాది క్రితం హెడ్‌కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందారు.

అల్లూరి స్ఫూర్తి, దేశభక్తి ఆదర్శం

ప్రజాశక్తి - ఏలూరు

అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి, దేశభక్తి ప్రతిఒక్కరికీ ఆదర్శమని బాలల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. అల్లూరి 125వ జయంత్యుత్సవాలు, వందో వర్ధంతిని సందర్భంగా బాలల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు అల్లూరి సీతారామరాజు వేషధారణతో ఏలూరులో ప్రదర్శన నిర్వహించారు. ఫైర్ స్టేషన్ సెంటర్‌లోని హేలాపురి సూపర్ మార్కెట్ వద్ద నుండి బాలల సంఘం నాయకులు ఎన్.గంగాభవాని, జి.శారద, డి.లావణ్య, బి.గంగాభవాని ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ అల్లూరి అతిచిన్న వయసులోనే బ్రిటిష్ పరిపాలన ప్రమాదాలను గ్రహించి గిరిజన ప్రాంత ప్రజలను సమీకరించి స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామి అయ్యారని కొనియాడారు. గంగాభవాని మాట్లాడుతూ దేశం కోసం త్యాగాలు చేసిన వారి జీవితాలను తెలుసుకోవాల్సిన అవసరం విద్యార్థులకు ఉందన్నారు. అందుకోసం అనేక కార్యక్రమాలను రాబోయే కాలంలో బాలల సంఘం చేపడుతుందని తెలిపారు.

వివిధ పాఠశాలల విద్యార్థులు అల్లూరి వేషధారణలో ముస్తాబై హేలాపురి సూపర్ మార్కెట్ నుండి ఫైర్‌స్టేషన్ సెంటర్, ప్రభుత్వాసుపత్రి, మధులత హోటల్ సెంటర్ మీదుగా ఆర్‌ఆర్ పేట పార్కు వరకూ ప్రదర్శన చేపట్టారు.



అల్లూరి వేషధారణలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యుత్ షాక్‌తో ఆక్వా రైతు మృతి


ప్రజాశక్తి - కలిదిండి

విద్యుత్ షాక్‌తో ఆక్వారైతు ప్రాణలు కోల్పోయిన ఘటన మండలంలోని వెంకటాపురంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కరేటి వెంకన్నబాబు (50) రొయ్యల సాగు చేస్తున్న చెరువు గట్టుపై గడ్డి కోస్తుండగా కరెంట్ వైరు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకన్నబాబుకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య చింతాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు.

పారిశ్రామిక ప్రమాదాలు నిరోధించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యాజమాన్యాల లాభాపేక్ష, ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగా శుక్రవారం అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన పారిశ్రామిక ప్రమాదంలో రెండు నిండు ప్రాణాలు కాలిపోయాయనీ ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకటరావు పేర్కొన్నారు. మరో ఐదుగురు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామిక తనిఖీ పర్యవేక్షణ అధికారాలను కుదించడం కారణంగా, అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం వల్ల తరచూ ఇలాంటి ప్రమాదాలకు సంభవిస్తున్నాయన్నారు. పరిశ్రమలపై లేబరు అధికారుల, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పారిశ్రామిక ప్రమాదాలు జరగకుండా స్పెషల్ డ్రైవ్‌లు, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మృతిచెందిన కార్మికుల కుటుంబానికి రూ.కోటి, గాయపడిన వారికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ యజమానిపై సీరియస్‌గా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.



ఆందోళన చేస్తున్న మొక్కజొన్న రైతులు

మీర్జాపురం సిపి విత్తనాలతో నష్టపోయాం

కంపెనీ వద్ద తూర్పుగోదావరి జిల్లా రైతుల ఆందోళన

పరిహారం చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మీర్జాపురంలోని సిపి సీడ్ కంపెనీ సరఫరా చేసిన మొక్కజొన్న విత్తనాలు సాగుచేసి నష్టపోయిన రైతులు ఆ కంపెనీ ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన 40 మంది రైతులు 450 ఎకరాల్లో సిపి కంపెనీ విత్తనాలు సాగుచేశారు. అయితే పూర్తిగా నష్టం వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు నష్టపరిహారం చెల్లించాలని కోరితే యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆందోళన బాట పట్టామని వారు తెలిపారు. పరిహారం చెల్లించే వరకూ ఆందోళన కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు.

గుత్తేదారులతో జగనన్న ఇళ్ల నిర్మాణం

భీమడోలు: గుండుగొలను జగనన్న లే అవుట్‌లో గృహ నిర్మాణ సంస్థ మధ్యవర్తిత్వంతో ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చిన గుత్తేదారులతో నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపుతున్నారని హౌసింగ్ ఎఇ సతీష్ తెలిపారు. నాలుగేళ్ల కితం జగనన్న లే అవుట్‌లో 870 గృహ నిర్మాణాలకు అవసరమైన 28.04 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇప్పటి వరకూ నాలుగు పర్యాయాలు లే అవుట్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణాలను చేపట్టింది. నిర్మాణాలకు అవసరమైన నీటి సరఫరా కోసం రూ.53 లక్షలతో బోర్లు వేసింది పైపులైన్‌తో పాటు నీటి నిల్వ కోసం సంప్‌లను గుండుగొలను గ్రామపంచాయతీ పరిధిలోని మూడు సచివాలయాలతో పాటు కోరుకొల్లు గ్రామపంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు కేటాయించారు. ఇప్పటివరకూ 21 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 228 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిని దాటి నిర్మాణాలను పూర్తి చేసుకున్నాయి. 47 ఇళ్ల రూఫ్ స్థాయికి చేరగా, 28 ఇళ్లు శ్లాబులు పూర్తయ్యాయి. ఈ దశలో గృహ నిర్మాణ లబ్ధిదారులను చైతన్యపరిచేందుకు లబ్ధిదారుని కుటుంబ సభ్యుల పేర తొలుత రూ.35 వేలు ఐకెపి రుణం, ప్రస్తుతం నిర్మాణాలను ప్రారంభించేందుకు ఆసక్తి కనబరిచేవారికి రూ.20 వేలు అడ్వాన్స్ రుణం ఇచ్చేందుకు ముందుకు వచ్చాయన్నారు.

విద్యార్థినికి నగదు బహుమతి

చాట్రాయి: మండలంలోని పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి శనివారం నగదు బహుమతి ప్రదానం చేసినట్లు పోలవరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నాగేశ్వరరావు తెలిపారు. 2023వ సంవత్సరం పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల్లో పోలవరం గ్రామానికి చెందిన శ్రీరాముల స్వప్న అనే విద్యార్థిని 563 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందని చెప్పారు. పోలవరం గ్రామానికి చెందిన కొండా విజయరత్నరాజు విద్యార్థినికి రూ.10,116 ప్రోత్సాహక నగదు బహుమతిని అందించారు. పోలవరం పాఠశాలలో విద్యార్థులకు మంచినీటి సౌకర్యం కోసం వాటర్ ప్లాంట్ లేదని కొండా విజయరత్నరాజు దృష్టికి తీసుకురాగా వాటర్ ప్లాంట్‌కు అయ్యే ఖర్చు తానే భరిస్తానని హామీ ఇచ్చారు. పదో తరగతిలో అత్యంత మార్కులు సాధించి నగదు బహుమతి పొందిన శ్రీరాముల స్వప్నను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నాగేశ్వరరావు, ఎం.కేశవరెడ్డి, జె.చంటి, ముఖర్జీ, చెన్నారెడ్డి, పి.రత్తయ్య అభినందించారు.

చిన్నంపేటలో ప్రభాకరరావు సంతాప సభ

చాట్రాయి: వ్యవసాయ కార్మిక సంఘం, సామాజిక చైతన్య వేదిక, జై భీమ్ యువసేన ఆధ్వర్యంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన తిరువూరు డివిజన్ కార్యదర్శి మర్సకట్ల ప్రభాకరరావు సంతాపసభ చిన్నంపేట దళితవాడలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమ్ము ఆనందం, ఇవి.శ్రీనివాస్, కొమ్ము నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన మహానాయకుడు ప్రభాకర్ అని కొనియాడారు. ఆయన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రతి కుటుంబానికి రెండు వందల రోజుల పని దినాలు, రూ.600 వేతనాలు ఇవ్వాలని, 15 రోజులకు ఒకసారి వేతనాలు చెల్లించాలని, పేస్లిప్పులు ఇవ్వాలని డిమాండ్లపై రాబోవు కాలంలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్ము లక్ష్మి, మరియమ్మ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

విద్యకు తొలి ప్రాధాన్యత

మండవల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని సిఆర్‌పి సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని లింగాల కాంప్లెక్స్ పరిధిలోని గన్నవరం గ్రామంలో పాఠశాలకు వెళ్లకుండా మానేసిన విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. బడి ఈడు పిల్లలంతా బడిలో విద్యనభ్యసించాలని బడి బయట ఉండకూడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిందన్నారు. నాడు-నేడు కార్యక్రమాన్ని తీసుకువచ్చి పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసి క్రమశిక్షణతో కూడిన అందిస్తున్నారన్నారు. ఆర్థిక పరిస్థితులు విద్యార్థి విద్యకు ఆటంకం కలగకుండా ఉండేలా ఏకరూపు దుస్తులు, పాఠ్య పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజన పథకంతో రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. ఆరోగ్యవంతమైన రాగిజావను కూడా అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులను సక్రమంగా పాఠశాలలకు పంపిస్తే పాఠశాలలో ఉన్న సౌకర్యాలను అందిపుచ్చుకొని విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు.

మాట తప్పడంలో జగన్ ఘనుడు : టిడిపి

ముసునూరు: మాట తప్పడంలో జగన్‌మోహన్‌రెడ్డిని మించిన నాయకుడు లేడని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో శనివారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్య పింఛను రూ.మూడు వేలు ఇస్తానని గెలిచిన తర్వాత రూ.250 పెంచుకుంటూ ఇస్తూ మాట తప్పారన్నారు. పేదలకు పక్కా ఇల్లు నిర్మించి ఒక రూపాయికి రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పి ఆ హామీ మరిచారన్నారు.

నేరాలు - ఘోరాలు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని జిల్లెల్లగూడెం పంచాయతీ కొత్తకుంకాల గ్రామంలో శనివారం తెల్లవారుజామున సంభవించిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోదెం సరస్వతికి చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు బాధితురాలిని పరామర్శించారు. జనసేన పార్టీ మండల ప్రెసిడెంట్ చిన్ని ఐటి విన్ కోఆర్డినేటర్ ఎవి.రావు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, రూ.ఐదు వేల నగదు అందించారు. బాధితులకు జనసేన పార్టీ ఎప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చీకట్ల సాయి, సునీల్, లక్ష్మణ్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు నుంచి దూకిన యువతికి గాయాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

తాను ఎక్కాల్సిన బస్సు కాకుండా వేరే బస్సు ఎక్కానని గుర్తించి యువతి కదులుతున్న బస్సు నుంచి కిందకు దూకడంతో గాయాలపాలైంది. ఈ సంఘటన ముదినేపల్లిలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. మండలంలోని పెయ్యేరుకు చెందిన యువతి గుడివాడ కళాశాలలో చదువుతుంది. ఈ క్రమంలో శనివారం ఉదయం ముదినేపల్లి బస్‌స్టేషన్‌లో గుడివాడ బస్సుకు బదులుగా పొరపాటుగా మచిలీపట్నం బస్సు ఎక్కింది. బస్సు గురజ రోడ్డు వైపు వెళ్లడం గమనించి కంగారుపడ్డ యువతి స్టేట్‌బ్యాంక్ వద్ద వెంటనే బస్సు మెట్లపై నుంచి కిందికి దూకింది. దీంతో యువతి తలకు, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే డ్రైవర్ బస్సును ఆపి యువతిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం యువతి బంధువులు వచ్చి ఆమెను ఇంటికి తీసుకెళ్లారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

దిబ్బగూడెం పరిసర ప్రాంతాల్లో తెలంగాణ నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనంచ చేసుకున్నారు. దిబ్బగూడెం పరిసర ప్రాంతాల్లో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేస్తుండగా తెలంగాణ నుంచి అక్రమంగా తరలిస్తున్న 104 క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని, కొర్రి రాము అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలపాలైన ఘటన శనివారం అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రమ్మ కాలానికి చెందిన కొరం రవీంద్ర, కోర్స సురేంద్ర ద్వి చక్ర వాహనంపై వేగంగా వస్తూ ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి పల్టీ కొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయలయ్యాయని తెలిపారు. 108 కు సమాచారం అందించడంతో హుటాహుటిన 108 వాహనంలో చికిత్స నిమిత్తం జంగారెడ్డి గూడెంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం సాయి స్ఫూర్తి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం

నూజివీడు రూరల్: పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కూసుమంచి సరళ కడుపు నొప్పి భరించలేక శనివారం ఆత్మహత్యకు ప్రయత్నించిందని ఆమె భర్త కూసుమంచి సుబ్బారావు తెలిపారు. ఇంట్లో ఉన్న కాలం చెల్లిన మందు బిళ్లలు మింగి చనిపోవడానికి ప్రయత్నించిందన్నారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించుతున్నారు. ఈ ఘటనపై నూజివీడు రూరల్ పోలీస్ సిబ్బంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న ట్రాక్టర్

ప్రయాణికులు సురక్షితం

నూజివీడు రూరల్: గొల్లపల్లి గ్రామంలోని ప్రధాన రహదారిపై శనివారం ఆర్‌టిసి బస్సును ఆయిల్‌పామ్ లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. స్థానికుల కథనం ప్రకారం నూజివీడు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు నూజివీడు నుంచి మచిలీపట్నం వెళుతుండగా ఆయిల్‌పామ్ లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ అదుపు తప్పి బస్సును ఢీ కొని పల్టీ కొట్టింది. ఆయిల్‌పామ్ గెలలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్సును కంట్రోల్ చేసి సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరగడంతో బస్సును రోడ్డుపై నిలిపివేశారు.

వైద్యుల సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ బేబీకమల, డాక్టర్ వజ్రకిరణ్‌లకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. డాక్టర్ సతీష్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎపి, తెలంగాణ కోఆర్డినేటర్ షేక్ మహబూబ్ సుభాని సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యులను ఘనంగా సత్కరించారు. జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కన్నం హనుమంతరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న మరో 16 మంది డాక్టర్లను సన్మానించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని మరో 8 మంది ప్రయివేట్ వైద్యులను కూడా సత్కరించారు. వైద్యుల సేవలను కొనియాడుతూ మొత్తం 25 మంది డాక్టర్లను సన్మానించామని క్లబ్ అధ్యక్షులు కన్నం హనుమంతరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కొండపల్లి పండు, జిల్లా సేవ కోఆర్డినేటర్ అట్లూరి సురేష్, మెడికల్ క్యాంపు జిల్లా ఇన్‌ఛార్జి మద్దిపాటి నాగేశ్వరరావు, క్లబ్ నాయకులు దాసరి శేషకుమార్, గోరంట్ల విజయరామరాజు, నంగులూరి జగత్ కుమార్ పాల్గొన్నారు.

ఉంగుటూరు : డాక్టర్స్ డే సందర్భంగా చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కెఎస్.సుబ్బరాజు, డి.శ్రావణ్‌రెడ్డిలను చేబ్రోలు వెల్ఫేర్ గ్రూపు సభ్యులు, గ్రామస్తులు సత్కరించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తూ జాతీయ స్థాయిలో చేబ్రోలుకు గుర్తింపు, అవార్డులు తీసుకురావడంలో వైద్యులు, సిబ్బంది పనితీరుకు నిదర్శనమని గ్రామస్తులు కొనియాడారు.

ఘనంగా డాక్టర్స్ డే

చింతలపూడి : చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను మానవత సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా చింతలపూడి మానవత సంస్థ అధ్యక్షులు సోమశేఖర్ మాట్లాడారు.

కైకలూరు : కొట్టాడ సచివాలయం వద్ద కొల్లేటికోట పిహెచ్‌సిలో పనిచేస్తున్న వైద్యులు శంకర్, కిరణ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకట కృష్ణ మోహన్, జెడ్‌పిటిసి సభ్యులు కూరెళ్ల బేబి, పార్టీ మండల అధ్యక్షులు భట్రాజు శివాజీ, సర్పంచి కొల్లాటి పద్మావతి, ఎంపిటిసి సభ్యులు సిద్ధాబత్తుల సువర్ణమ్మ, తహశీల్దార్ మురళీకృష్ణ, కొల్లాటి శ్రీను, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. టిడిపి ఆధ్వర్యంలో వైద్యులు పిచ్చయ్య చౌదరి, పెరుమాళ్ల పుల్లేశ్వరరావు, గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ రాంబాబులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎండి.జాని, మాల్యాద్రి సత్యనారాయణ, గంగుల యేసురాజు, కంచర్ల రామకృష్ణ, కనిశెట్టి శ్యాము పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: రక్త హీనత కలిగిన పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక పోషకాహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆశా తెలిపారు. శనివారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో రక్త హీనత కలిగిన పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రక్త హీనత కలిగిన పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఫ్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా మండలంలో జరుగుతున్న పనుల గురించి ఆరా తీశారు. ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం దర్భగూడెంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోర్స పోసమ్మ, వైద్యాధికారినిలు సుష్మ, గాయత్రి, ఫార్మసిస్టు నాగేశ్వరావు, ఎల్‌టి మంగ, ఎంపి హెచ్ ఎ.ప్రసాద్, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ కార్యాలయంలో డాక్టర్ ఆర్ఎస్ఆర్ కె.వరప్రసాదరావును రెడ్ క్రాస్ సిబ్బంది, మానవతా సభ్యులు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, మానవత సభ్యులు కడియాల కష్ణారావు, రత్నాకరరావు, మేతర అజయ్ బాబు, రమణ, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మండలంలోని తాడినాడలో వాసవీ క్లబ్ కలిదిండి గోల్డ్ ఆధ్వర్యంలో పలువురు అర్‌ఎంపి వైద్యులను ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక వైద్యం అందించడంతో పాటు, కరోనా సమయంలో తమ ప్రాణాలను లెక్కచేయకుండా అందించిన సేవలు మరువలేనివని వాసవీ క్లబ్ కలిదిండి గోల్డ్ అధ్యక్షులు నూకల శ్యామలరావు గుప్తా అన్నారు. అర్‌ఎంపి వైద్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భీమడోలు: ఉద్యోగ నిర్వహణలో భాగంగా ప్రతిఒక్కరికి నియమ నిబంధనల కనుగుణంగా వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ సునీత తెలిపారు. డాక్టర్స్ డే ను డైమండ్ లయన్స్ క్లబ్ భీమడోలు శాఖ, పిఎంపి అసోసియేషన్ యూనిట్ ఆధ్వర్యంలో వేరు వేరుగా ఆదివారం నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి - ఉంగుటూరు

క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిపుచ్చుకునేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వాటిని పరిష్కరించేందుకే సిఎం జగన్ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. మండలంలోని గోపీనాథపట్నం సచివాలయంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గోపీనాథపట్నం, తిమ్మయ్యపాలెం గ్రామాల్లో కుల ధ్రువీకరణ 112, ఆధాయ ధ్రువీకరణ 97, కౌలు కార్డులు 45, ఆధార్‌కి ఫోన్ నెంబరు అనుసంధానం 55, రేషన్ కార్డులు ఐదు, హౌస్ మ్యాపింగ్‌కు ఆరుగురు దరఖాస్తులు చేసుకోగా వారందరికి పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మయ్య పాలెం, గోపీనాథపట్నం సర్పంచులు సింహాద్రి శ్రీదేవి, పుత్సకాయల విష్ణుమూర్తి, మండల ప్రత్యేకాధికారి, డిఎన్‌డిఒ డి.రమణ, తహశీల్దార్ ఎవి.రమణరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు, డిటీ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, ఇఒపిఆర్‌డి షేక్ షంషుద్దీన్, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి, అధికార పార్టీ మండల, జిల్లా నాయకులు, వాలంటీర్లు, సచివాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం : పోలవరం మండల కేంద్రంలో గ్రామ సచివాలయం-2 పరిధిలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, ఐటిడిఎ పిఒ జివివి.సత్యనారాయణ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు కలుం హేమకుమారి, తహశీల్దార్ బి.సుమతి, ఎంపిడిఒ జి.శ్రీను, కో-ఆప్షన్ సభ్యులు మండల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోలవరం సర్పంచి పొడుం పుష్ప పెన్షన్ దారులకు పెన్షన్లు అందించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని వెంకటాద్రిగూడెంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ఎంఎల్ఎ ఎలిజా సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రామారావు, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజసుధాకర్, మిర్యాల దిలీప్, సిటీ మెడికల్ దుర్గారావు, వెంపా కృష్ణ, శ్రీను, జెడ్‌పి సిఇఒ రవికుమార్, రెవిన్యూ శాఖ, మండల పరిషత్, పోలీస్, పంచాయతీరాజ్, నీటిపారుదల, విద్యుత్, వెలుగు పలు శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

మండవల్లి : రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని ఇంటి వద్దకే వచ్చి అందించేలా చేయడంలో ముఖ్యమంత్రి జగన్‌కు సాటి ఎవరూ రారని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని అయ్యవారి రుద్రవరం సచివాలయం పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ, ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, సర్పంచి బోనం శేషగిరి, రైతు సంఘం నాయకులు చేబోయిన వీర్రాజు, రత్తయ్య నాయుడు, కుంచే వాకలయ్య, నంగెడ్డ శివ, తహశీల్దార్ రాజకుమార్, ఎంపిడిఒ రమణ, వివిధ శాఖల అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : మండలంలోని అన్నవరం గ్రామ శివారు సింహాద్రిపురంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ప్రభుత్వం నడుస్తుందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. చంద్రబాబు చెప్పే మాయ మాటలను ప్రజలు నమ్మడంలేదన్నారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని ప్రత్యేక అధికారి పివిఎస్.నాయుడు తెలిపారు. శనివారం అంకన్నగూడెంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, తహశీల్దార్ సుందర్‌సింగ్, ఎంపిడిఒ కృష్ణప్రసాద్, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

భీమడోలు: అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చేందుకు నిర్వహిస్తున్న 'జగనన్న సురక్ష' సర్వేను వినియోగించుకోవాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసు బాబు తెలిపారు. జగనన్న సురక్షను తొలిసారిగా ఆదివారం దుద్దేపూడి సచివాలయం వద్ద నిర్వహించారు. ప్రారంభోత్సవానికి గుర్తుగా గ్రామ సచివాలయంలో ఎంఎల్ఎ మొక్కలను నాటారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు కనుమాల రామయ్య అధ్యక్షత వహించారు. మండల ప్రత్యేక అధికారి డిఆర్‌డిఎ పిడి ఆర్.విజయ రాజు గ్రామ సచివాలయ పరిధిలోని కోడూరుపాడు, దుద్దేపూడి గ్రామ పంచాయతీలలో కొనసాగిన సర్వే వివరాలను ఎంఎల్ఎకు తెలియజేశారు. 809 గృహాలు గల ఆ రెండు గ్రామాల నుంచి 392 దరఖాస్తులు సమస్యకు పరిష్కారం కోరుతూ వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ పద్మావతి దేవి, తాహశీల్దార్ ఇందిరాగాంధీ, సొసైటీ అధ్యక్షులు ఆర్.సత్య శ్రీనివాసరావు, కోడూరుపాడు సర్పంచి కె.నాగేశ్వరరావు, ఎంపిటిసి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'జగనన్న సురక్ష' వివరాలను ఎంపిడిఒ పి.మల్లీశ్వరి శనివారం వివరించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి 11 అంశాలపై గత నెలలో గ్రామ సచివాలయ వాలంటీర్ల సర్వే ప్రారంభించారు. మండలంలో రెండు టీంలతో సభలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎంపిడిఒ మల్లీశ్వరితో పాటు డిప్యూటి తాహశీల్దార్ పి.మరియన్న, ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సూర్య ప్రకాశరావుతో ఒక టీము, తాహశీల్దార్ కె.శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి టివి సారధి, ఆర్ఐ పి.శివకుమార్‌తో పాటు మరో టీమ్ మండలంలో పర్యటిస్తారన్నారు.

ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికై జగనన్న సురక్ష నిర్వహణని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. పెదగొన్నూరులో జగనన్న సురక్ష తొలి గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

కైకలూరు: జగనన్న సురక్షా కార్యక్రమంతో అర్హులకు మరింత మేలు కలుగుతుందని ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ తెలిపారు. శనివారం కొట్టాడ సచివాలయ పరిధిలోని పెద్ద కొట్టాడలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమం విధి విధానాలు ఆయన తెలిపారు. ఎంపిపి అడవి వెంకట కృష్ణమోహన్, జడ్‌పిటిసి కురేళ్ల బేబీ, సర్పంచి కొల్లాటి పద్మావతి, ఎంపిటిసి సువర్ణ, మండల అధ్యక్షులు తామరకొల్లు సర్పంచి భట్రాజు శివాజీ, ఎంఆర్ఒ మురళీకృష్ణ, అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సర్పంచికి ఎంఎల్ఎ పరామర్శ

భీమడోలు: ఇటీవల అనారోగ్యం పాలై చికిత్స అనంతరం స్వగృహానికి వచ్చిన దుద్దేపూడి సర్పంచి నీలం శ్రీనివాసరావును ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు.

మొక్కలు నాటిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

వెంకటాద్రిపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారానే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. మొక్కలు నాటడం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి వైస్ ఛైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపిపి ఆరేపల్లి శిరీష, సర్పంచి మోలుగుమాటి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు పథకాలను వినియోగించుకోవాలి

భీమడోలు : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పొలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహిమా బేగం హసేన కోరారు. అనంతరం సర్పంచి, ఎంపిటిసి ఎ.దేవి నాగేంద్ర ప్రసాద్ కలిసి గ్రామ పరిధిలోని మూడు ఎంపిపి ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యా బోధన తీరు, విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, ఇతర అంశాలను పరిశీలించారు. అనంతరం మూడు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలో భాగంగా కేటాయించిన బ్యాగులు, బెల్టులు, టైలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.తులసి, మోహన్ రావు, బాల భాస్కర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి శిక్షణకు అహ్మద్ ఎంపిక

ఏలూరు టౌన్: అస్సాం రాష్ట్రం గౌహతీ నగరంలో ఈ నెల 5వ తేది నుంచి 14 వ తేదీ వరకూ జరిగే జాతీయ కళా సాంస్కృతిక శిక్షణకు శనివారపు పేట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ ఎండి ఇర్షాద్ అహ్మద్ ఎంపిక య్యారు. ఇర్షాద్ అహ్మద్‌ను పలువురు అభినందించినారు.

శ్రమదానంతో గోతులు పూడ్చివేత

జంగారెడ్డిగూడెం: రోడ్డుపై రాకపోకలకు అంతరాయంగా ఉన్న గోతులను ఆటో కార్మికులు శ్రమదానంతో శనివారం పూడ్చారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నిర్మల హాస్పిటల్ ఎదురుగా రోడ్డుపై ఏర్పడిన గోతులతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో స్పందించిన స్థానిక ఆటో కార్మికులు గోతులు పోచడానికి ముందుకు వచ్చారు. సమీపంలోని రాళ్ళ మట్టితో నింపి ప్రమాదకరంగా ఉన్న గోతులు పూడ్చారు. ప్రధాన రహదారిపై గోతులు పూడ్చిన ఆటో కార్మికులను పలువురు అభినందిస్తున్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి సాయం

టి.నరసాపురం : ఎపిగుంటలో గ్యాస్ ప్రమాదానికి గురై తాటాకిళ్ల దగ్ధమై నిరాశ్రయులైన బొక్క గంగరాజు కుటుంబ సభ్యులను శనివారం టిడిపి నాయకులు పరామర్శించారు. 50 కేజీల బియ్యం రూ.16 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైన గంగరాజు కుటుంబానికి రెవెన్యూ అధికారులు తక్షణ సహాయం అందించలేకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంగరాజు కుటుంబానికి గృహం నిర్మించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆసుపత్రి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చెయ్యాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన బొర్రంపాలెం పర్యటించి నిర్మాణంలో ఉన్న ఆరు పడకల ఆసుపత్రిని పరిశీలించారు. అనంతరం కాంట్రాక్టరుతో ఫోన్లో మాట్లాడారు. ఆసుపత్రి నిర్మాణంలో జాప్యం గురించిన వివరాలు తెలుసుకున్నారు. వారంలో పనులు పూర్తి చేయాలని ఆసుపత్రి నిర్మాణ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయనతో పాటు నాయకులు మోరవినేని అనిల్ బాబు, సాగర్ బాబు, కొత్త ప్రకాష్ బాబు, కొనకళ్ల సర్వేశ్వరావు, పల్లా రమేష్, గుండె పాండురంగ, కలపర్తి మునేశ్వరావు పాల్గొన్నారు.

నేడు వేణుగోపాలుని కళ్యాణోత్సవం

ప్రజాశక్తి - ముదినేపల్లి

రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయంలో ఆదివారం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారి శాంతి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఆషాఢ మాసం సందర్భంగా ప్రతి ఏటా ఆనవాయితీగా ఈ కళ్యాణాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

దాతల సాయం అభినందనీయం

ప్రజాశక్తి - కలిదిండి

గ్రామాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని కోరుకొల్లు హరిజనవాడ వద్ద సిబి కెనాల్ పై నిర్మించిన స్నానాల రేవును శనివారం ప్రారంభించారు. దాత ఎన్ఆర్ఐ వర్రె వెంకట సత్యన్నారాయణ అందించిన రూ.3లక్షల సాయంతో రేవు నిర్మితమైందని వర్రె జగన్నాధం చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి చెన్నంశెట్టి కృష్ణ తెలిపారు. ట్రస్ట్ అధ్యక్షులు చీకటి లక్ష్మణ, ఉప సర్పంచి సిహెచ్ నాగరాజు, వార్డు సభ్యులు యాళ్ల నల్లయ్య, సిరింగి కిషోర్, దాసి సరోజినీ బాయ్, చీకటి సరళ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ బీమా తప్పనిసరి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రతిఒక్కరూ తప్పనిసరిగా బీమా కలిగి ఉండాలని సర్పంచి ఎం.జాన్సీ సూచించారు. స్థానిక నాగేంద్ర స్వామి కళ్యాణ మండపంలో గ్రామానికి చెందిన సురవరపు త్రినాథ్(54) మృతి చెందడంతో బీమా సొమ్మును ఆమె భార్యకు శనివారం అందించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ బొంతు దుర్గారావు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఇఒ-2 తనిఖీలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ఎస్‌టి కాలనీ పాఠశాలను ఎంఇఒ-2 జమలయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించారు. జగనన్న కిట్ల పంపిణీ తదితరాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

బాధిత కుటుంబానికి జనసేన సాయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని ఎపిగుంట గ్రామానికి చెందిన బొక్కా గంగరాజు ఇల్లు గ్యాస్ ప్రమాదంలో కాలిపోయింది. జనసేన పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రెండు బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు, కూరగాయలు, బట్టలు, దుప్పట్లు, రూ.11 వేల నగదు అందించారు. ఈ సందర్భంగా చిర్రి బాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఒక పక్కా గృహాన్ని నిర్మించే విధంగా స్థానిక అధికార పార్టీ నాయకులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు జనసేన నాయకులు అడపా నాగరాజు, ఎం.చినపెంటారావు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - భీమడోలు

మండల విద్యాశాఖాధికారి భాస్కర కుమార్ శనివారం మండలంలోని భీమడోలు నెంబర్ 1, 2 ప్రాథమిక పాఠశాలు, అన్నే వారి గూడెం లోని ప్రాథమికోన్నత పాఠశాల, దుద్దేపూడి గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. జగనన్న విద్యా కానుకల పంపిణీ, ఇతర అంశాలపై ఆరా తీశారు. విద్యా బోధన కొనసాగుతున్న తీరుపై ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్ఆర్‌పి సత్యప్రసాద్ పాల్గొన్నారు.